క్లుప్తంగా

ఎస్‌ఐ బాధ్యతల స్వీకరణ


సురేష్

నందికొట్కూరు: పట్టణ ఎస్‌ఐగా సురేష్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. సమస్యలు ఉంటే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. చట్టాన్ని చేతిలోకి తీసుకుంటే కేసులు నమోదు చేస్తామన్నారు.

ఎంపీడీఓగా గోపీక్రిష్ణ

పాములపాడు: మండల ఎంపీడీఓగా గోపీక్రిష్ణను నియమిస్తూ జెడ్పీ సీఈఓ ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల సమయంలో అనంతపురం జిల్లాకు బదిలీపై వెళ్లిన గోపీక్రిష్ణ తిరిగి ఇక్కడికి వచ్చారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు తీసుకోనున్నారు.

నందికొట్కూరు ఎంపీడీఓగా శోభారాణి

నందికొట్కూరు: స్థానిక ఎంపీడీఓగా శోభారాణిని ప్రభుత్వం నియమించింది. 2024 ఎన్నికలకు ముందు ఆమె ఇక్కడ పనిచేశారు. ఎన్నికల సమయంలో వేరే జిల్లాలో పనిచేసి తిరిగి సొంత జిల్లాకు వచ్చారు. త్వరలోనే బాధ్యతలు స్వీకరించనున్నారు.

పైప్‌లైన్ లీకేజీ సమస్యకు పరిష్కారం


మరమ్మతు పనులు చేస్తున్న కూలీలు

పాములపాడు: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో లీకేజీ అవుతున్న తాగునీటి పైప్‌లైన్‌కు ఆదివారం మరమ్మతు పనులు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మేకల భాగ్యమ్మ మాట్లాడుతూ.. కాలనీలో నాలుగు రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయిందన్నారు. పైప్‌లైన్ పగిలిపోవడం వల్ల సమస్య ఏర్పడిందన్నారు. మరమ్మతులు చేయడంతో కాలనీ వాసులకు నీటి సమస్య పరిష్కారమైందని పేర్కొన్నారు. వార్డు సభ్యుడు మద్దిలేటి, వైఎస్సార్‌సీపీ నాయకులు రాజశేఖర్ పనులను పర్యవేక్షించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే చర్యలు


వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ

మిడుతూరు: వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్‌ఐ జగన్‌మోహన్ సూచించారు. ఆదివారం స్థానిక వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం సమీపంలో వాహనాల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనం నడపడం, ఫోన్ మాట్లాడుతూ నిర్లక్ష్యంగా నడపడం తదితర కారణాల వల్ల తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని పేర్కొన్నారు. ప్రమాదాలు నివారించాలంటే ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అనంతరం వాహన రికార్డులు సరిగ్గా లేనివారికి జరిమానా విధించారు.

వయనాడ్ బాధితుల సహాయార్థం విరాళాల సేకరణ


విరాళాలు సేకరిస్తున్న రైతు సంఘం నాయకులు

వెలుగోడు: కేరళ రాష్ట్రం వయనాడ్ వరద బాధితులను మానవతా దృక్పథంతో ఆదుకుందామని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.రాజశేఖర్ పిలుపునిచ్చారు. వరద బాధితుల సహాయార్థం ఆదివారం పట్టణంలో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు. ప్రజల నుంచి సేకరించిన మొత్తం రూ.6640 విరాళాన్ని కేరళ సీఎం సహాయ నిధికి పంపించారు. సీఐటీయూ నాయకులు ఎస్ఎండీ రఫీ, రైతు సంఘం జిల్లా నాయకులు ఎం.వీరన్న, సీఐటీయూ నాయకులు శ్రీనివాసులు, బాషా తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి ఎంపీడీఓగా దాసరి మేరి

కొత్తపల్లి: ఎంపీడీఓగా మరోసారి దాసరి మేరి రానున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా కొత్తపల్లి ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న మేరి ఇక్కడి నుంచి బదిలీపై సత్యసాయి జిల్లా మడకశిర మండలానికి వెళ్లారు. ప్రభుత్వం మరలా యథాస్థానాన్ని కేటాయిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆమె మళ్లీ కొత్తపల్లి ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రస్తుత ఎంపీడీఓ జవహర్‌బాబు బదిలీపై వైఎస్సార్ జిల్లా సిద్ధవటం మండలానికి వెళ్లారు.

గ్రామీణ వైద్యానికి చెద

- గ్రామాలలో ప్రారంభానికి నోచుకోని విలేజ్ హెల్త్ క్లినిక్‌లు
- పల్లె ప్రజల ఆరోగ్యం పట్టని ప్రభుత్వం



గువ్వలకుంట్ల, కొక్కెరంచ గ్రామాల్లో నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచుకోని విలేజ్ హెల్త్ క్లినిక్‌లు


నందికుంటలో మొదటి దశలోనే నిలిచిపోయిన హెల్త్ క్లినిక్ భవన పనులు


దుద్యాలలో తుదిదశలో నిలిచిపోయిన హెల్త్ క్లినిక్ భవన నిర్మాణం

కొత్తపల్లి: గ్రామీణ ప్రాంత ప్రజలకు స్థానికంగానే వైద్య సేవలు అందాలన్న లక్ష్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా గ్రామ సచివాలయాలు, రైతుల శ్రేయస్సు కోసం రైతు భరోసా కేంద్రాలు, పాలశీతలీకరణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రజలకు గ్రామాల్లోనే మెరుగైన వైద్యం అందేలా హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటుచేశారు. నేడు కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో క్లినిక్‌ల నిర్మాణాలు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. దీంతో గ్రామీణ వైద్యం లక్ష్యం నీరుగారుతోంది.

గ్రామాలలోని ప్రజలు అనారోగ్యం బారిన పడితే మండల కేంద్రం, దగ్గర్లోని పట్టణాలకు వెళ్లి చికిత్స చేయించుకోవాల్సిన పరిస్థితి గతంలో ఉండేది. ఈ పరిస్థితి నుంచి గ్రామీణ ప్రాంత ప్రజలకు విముక్తి కలిగేలా గ్రామాలలోనే మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటుకు నాంది పలికారు. వీటి నిర్మాణాలను పూర్తిచేసి క్లినిక్‌లో ఓ వైద్యుడిని నియమించి సొంత గ్రామంలోనే ప్రజలకు వైద్యం అందుబాటులోకి తీసుకురావాలన్న దృఢ నిశ్చయంతో ఈ భవనాల నిర్మాణాలు చేపట్టారు. అందులో భాగంగా మండలంలో 7 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలను అప్పటి ప్రభుత్వం ప్రారంభించింది. ఇందుకు రూ.1,10,25,000 నిధులు మంజూరు చేసింది. ఇందులో గువ్వలకుంట్ల, కొక్కెరంచ గ్రామాలలో ఈ భవనాల నిర్మాణం దాదాపుగా పూర్తిచేసుకుని ప్రారంభానికి చేరువలో ఉన్నాయి. మరికొన్ని గ్రామాలలో భవనాల నిర్మాణ పనులు మధ్యలో ఆగిపోయాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు గడిచినా ఈ భవన నిర్మాణాలు ఇంకా పునఃప్రారంభం కాలేదు. వీటిని కూటమి ప్రభుత్వం పూర్తిచేస్తుందా? మిగతా పనుల్లాగే వదిలేస్తుందా? అన్న సందిగ్ధంలో గ్రామీణులు ఉన్నారు. కనీసం పూర్తయిన వాటిని ప్రారంభించి గ్రామాల్లో వైద్య సేవలు అందించాలని కోరుతున్నారు.

క్లినిక్‌ల నిర్మాణం పూర్తిచేయాలి



గ్రామాల్లోనే ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలను చేపట్టింది. అందులో కొన్ని భవనాలు పూర్తయ్యాయి. కొన్ని భవనాల నిర్మాణం మధ్యలో నిలిచిపోయింది. వాటిని ప్రస్తుత ప్రభుత్వం పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తే బాగుంటుంది. ప్రజాధనం వృథా కాకుండా భవనాలను ప్రారంభించి గ్రామాల్లోనే ప్రజలకు వైద్యసేవలందించాలి.

– నక్క స్వాములు, సీపీఎం మండల నాయకుడు

గ్రామంలోనే అందుబాటులోకి వస్తే బాగుంటుంది



మా గ్రామంలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ నిర్మాణం పూర్తయ్యింది. అయితే ఇప్పటివరకు క్లినిక్‌ను ప్రారంభించలేదు. అస్సలు పట్టించుకున్న పాపాన పోలేదు. క్లినిక్‌ను ప్రారంభించి వైద్యుడిని నియమిస్తే గ్రామంలోనే వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి. ఎంతో దూరాన ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లాల్సిన పని ఉండదు. గ్రామంలో వైద్యం అందితే వ్యయ ప్రయాసలు ఉండవు., వైద్యం కోసం వేచి చూడాల్సిన అవసరం ఉండదు.

– నాగరత్నం, కొక్కెరంచ గ్రామస్తుడు

నేడు శివాలయంలో ప్రత్యేక పూజలు

ఆత్మకూరు: పట్టణంలోని శివాలయంలో శ్రావణ మాసం సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. వారు మాట్లాడుతూ శ్రావణమాసం సందర్భంగా పార్వతీమాతకు ప్రత్యేక అలంకరణతో పాటు కుంకుమార్చన, విశేష పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అలాగే స్వామివారికి పంచామృతాభిషేకాలతో పాటు అన్నదాన కార్యక్రమం చేపడతామన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

సత్ప్రవర్తనతో మెలగాలి


రౌడీషీటర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ హరిప్రసాద్

కొత్తపల్లి: సత్ప్రవర్తనతో మెలిగితే సమాజంలో మంచి పేరు వస్తుందని ఎస్‌ఐ హరిప్రసాద్ సూచించారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో నడుచుకుంటే సమాజంలో మంచి పేరు వస్తుందన్నారు. ఎలాంటి గొడవలు, అల్లర్లు, ఘర్షణలకు పోకుండా ఉండాలని సూచించారు. ప్రవర్తనలో మార్పురాకుంటే శిక్షార్హులు అవుతారన్నారు. వారి వల్ల ఎలాంటి గొడవలు జరిగినా మరలా కేసులు నమోదు అవుతాయని, జీవితం అస్తవ్యస్తం అవుతుందన్నారు. కేసులు నమోదు అయితే కుటుంబాల్లో అసమానతలు ఏర్పడతాయన్నారు. కేసుల నుంచి విముక్తి కావాలంటే సమాజంలో కలిసి జీవించాలని సూచించారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు


క్రికెట్ పోటీల్లో గెలుపొందిన వెలుగోడు సొసైటీ ఉద్యోగులు

వెలుగోడు: నంద్యాల జిల్లా సహకార సంఘం ఉద్యోగుల యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో వెలుగోడు సొసైటీ ఉద్యోగులు ప్రతిభ కనబరిచారు. జిల్లాలోని అన్ని సహకార సంఘాల ఉద్యోగులు క్రికెట్ పోటీల్లో పాల్గొనగా వెలుగోడు బ్రాంచ్ విజేతగా నిలిచింది. రెండో స్థానంలో సిరివెళ్ల బ్రాంచ్, మూడో స్థానంలో నంద్యాల బ్రాంచ్ యూనియన్ నిలిచి బహుమతులు అందుకున్నాయి. మ్యాన్ ఆఫ్ ది సిరీస్ రేవంత్, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ బౌలర్‌గా ఆత్మకూరు క్రీడాకారుడు అల్తాఫ్ బహుమతులు అందుకున్నారు. నంద్యాల జిల్లా సహకార సంఘాల అధ్యక్షుడు కే.వీరభద్రుడు, గౌరవాధ్యక్షుడు విజయభాస్కర్ రెడ్డి, వెలుగోడు బ్రాంచ్ మేనేజర్ భూమా నారాయణ రెడ్డి, జనరల్ సెక్రటరీ సుబ్బారావు, జిల్లా ఉపాధ్యక్షుడు మనోహర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సేవ చేయడం దేవుడిచ్చిన వరం


ఎంపీడీఓ కవిరాజును సన్మానిస్తున్న జెడ్పీటీసీ దివ్య

పగిడ్యాల: ప్రజలకు సేవ చేయడం దేవుడిచ్చిన వరమని జెడ్పీటీసీ సభ్యురాలు పుల్యాల దివ్య అన్నారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కవిరాజు బదిలీ సన్మాన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో అనంతపురం జిల్లా నుంచి పగిడ్యాల ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన కవిరాజు 6 నెలల పాటు మండలానికి సేవలు అందించారన్నారు. ఉద్యోగులకు పదవీ విరమణ, బదిలీలు సర్వసాధారణమని.. ప్రజలకు ఆయన అందించిన సేవలను కొనియాడారు. ఎక్కడికి వెళ్లినా ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేయాలని కోరారు. అనంతరం ఆయన్ను పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నాగేంద్రయ్య, ఎంఈఓ సుభాన్, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ నాగరాజరావు, పంచాయతీ కార్యదర్శి కోట్ల వెంకటేశ్వర్లు, సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న, జెడ్పీటీసీ మాజీ పుల్యాల నాగిరెడ్డి పాల్గొన్నారు.

రైతులకు పెట్టుబడి సాయం అందించాలి


మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం నాయకుడు వెంకటేశ్వర్లు

మిడుతూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు పెట్టుబడి సాయంగా రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చి.. ఇప్పుడు మిన్నకుండిపోవడం సరికాదని ఏపీ రైతు సంఘం జిల్లా నాయకుడు వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం మిడుతూరులో రైతు సంఘం నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై దాదాపు రెండు నెలలు అవుతున్నా నేటికీ అన్నదాత సుఖీభవ పథకం అమల్లో జాప్యం చేయడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విధి విధానాలను ప్రకటించి తక్షణమే రైతుల ఖాతాలో నగదు జమ చేయాలన్నారు. రైతులు పంట సాగుకు పెట్టుబడి లేక వ్యాపారులను ఆశ్రయించి అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాది మిడుతూరును కరువు మండలంగా ప్రకటించినా ఇంత వరకు నష్టపరిహారం అందించలేదన్నారు. రైతు సంఘం నాయకులు స్వామన్న, నాగోషులు, మద్దిలేటి, ఓబులేసు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం


ప్రచారం చేస్తున్న ప్రబోధ సేవా సమితీ సభ్యులు

నందికొట్కూరు: మండల పరిధిలోని శాతనకోట గ్రామంలో త్రైత సిద్ధాంతం భగవద్గీత గ్రంథంపై ఆదివారం ప్రచారం చేశారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక రామచంద్రుడు, మునిదాసు త్రైత సిద్ధాంతంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సమితీ సభ్యులు రామచంద్రుడు, మునిదాసు, పుల్లారెడ్డి, వెంకటేశ్వర్లు, మద్దిలేటి, సంజీవ, శ్రీనివాసులు, పార్థసారథి, సుబ్బలక్ష్మి, సుజాత పాల్గొన్నారు.

• మల్లన్నకు నృత్య నీరాజనం


సంప్రదాయ నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆలయ దక్షిణ మాఢవీధిలోని నిత్యకళా వేదికపై తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఎన్.రాధిక, బృందం వారిచే సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహాగణపతిం, శివతాండవం, అయిగిరినందిని, తాండవ నృత్యకరి, హరహర శంకరా, భో శంభో, నమశ్శివాయతే, కాలభైరవాష్టకం, భవాని అష్టకం తదితర గీతాలకు, అష్టకాలకు శ్రీహిత, హర్షిత, హిరణ్మయి, సాత్విక, తేజస్విని, వైష్ణవి, శృతిక తదితరుల నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.

రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమానికి కృషి

ఆత్మకూరు: డివిజన్ పరిధిలోని ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మండల ఏపీఎస్‌ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు కలిముల్లా పేర్కొన్నారు. పట్టణంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కర్నూలు పట్టణంలోని అంబేడ్కర్ కళా భవనంలో నేడు సమావేశం జరిగిందని, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారన్నారు. ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం ఇంటి స్థలాలను కేటాయించి గృహ నిర్మాణం చేపట్టాలన్నారు. ఆరోగ్యరీత్యా అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. ఆత్మకూరు ఏపీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు వెంకటేశ్వర్లు, షరీఫ్, లింగన్న, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం


నగదు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

జూపాడుబంగ్లా: మండలంలోని 80 బన్నూరు గ్రామానికి చెందిన రంగమ్మ(85) అనారోగ్యంతో మృతిచెందింది. ఆమె అంత్యక్రియలకు వైఎస్సార్‌సీపీ నాయకులు రూ.5 వేల ఆర్థిక సాయం చేశారు. వైఎస్సార్‌సీపీ నేత బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ఆదేశాల మేరకు గ్రామానికి చెందిన నాయకులు ఎల్లారెడ్డి, నూనెపల్లె నాగిరెడ్డి, నూనెపల్లె రమణారెడ్డి, తెలుగు సాంబ, అంజి, రాజేష్, దర్గయ్య, శ్రీను, బాలు, వడ్డెశంకర్, వడ్డెనాగేషు బాధిత కుటుంబానికి నగదు అందజేశారు.

చిరుత కలకలం

వెలుగోడు: మండలంలోని వేల్పనూరు గ్రామ పొలిమేరలో చిరుత సంచారం కలకలం రేపింది. చిరుత సంచరిస్తోందనే సమాచారంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పొలాల్లో చిరుత సంచరిస్తుందని అటవీ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ఆదివారం సాయంత్రం అధికారులు పులి అడుగుజాడల కోసం గాలించారు. ముందు రోజు వర్షం పడడంతో పులి అడుగుజాడలు చెరిగిపోయాయి. దీంతో అధికారులు ఎటు నిర్ధారించుకోలేకపోయారు. అయినా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చిరుత సమాచారం తెలిస్తే వెంటనే అధికారులకు తెలియజేయాలని కోరారు.

అవయవదానం చేసి ప్రాణదాతలు కండి



పోస్టర్లను విడుదల చేస్తున్న రెడ్ క్రాస్ సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): అవయవదానం చేసి ప్రాణదాతలు కావాలని రెడ్‌క్రాస్ సొసైటీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు దస్తగిరి, వైస్ చైర్మన్ మారుతి కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో అవయవదానంపై అవగాహన కల్పించే పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అవయవదానం చేయడం ద్వారా 8 మందికి జీవితాలను ప్రసాదించవచ్చని చెప్పారు. ఈనెల 13న అంతర్జాతీయ అవయవదాన దినోత్సవం సందర్భంగా స్థానిక శాంతిరాం మెడికల్ కళాశాల ఆడిటోరియంలో జిల్లా కలెక్టర్ రాజకుమారి చేతుల మీదుగా అవయవదానం చేసిన వారి కుటుంబ సభ్యులకు, అలాగే చనిపోయిన తర్వాత వైద్య కళాశాలలకు శరీరం దానం చేయడానికి అంగీకరించిన వారికి సన్మానించనున్నట్లు తెలిపారు. అవయవదానం చేసే వారు వారు 8977750583కు సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు ఉస్మాన్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

శ్రీగిరిపై భక్తజన సందడి


మల్లన్న దర్శనానికి క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో వెలసిన భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. శ్రీశైల మల్లన్నను దర్శించుకుని ఆధ్యాత్మిక అనుభూతి, శ్రీశైలం డ్యాం క్రస్ట్‌గేట్ల నుంచి జాలువారుతున్న కృష్ణమ్మ అందాలను కన్నులారా వీక్షించి పర్యాటక అనుభూతి పొందేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు వేలాదిగా తరలివచ్చారు. వేకువజామున్నే పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు మల్లన్న దర్శనానికి క్యూలైన్ వద్దకు చేరుకున్నారు. ఉచిత, శీఘ్ర, అతి శీఘ్ర దర్శన క్యూలైన్ల ద్వారా భక్తులు స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయంలో గర్భాలయ, సామూహిక అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలను నిలుపుదల చేశారు. భక్తులందరికీ స్వామిఅమ్మవార్ల సౌకర్యవంతమైన దర్శనం కల్పిస్తున్నారు. భక్తుల శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. భక్తుల రద్దీతో క్షేత్ర పురవీధులన్నీ కిటకిటలాడాయి. మల్లన్న దర్శనం అనంతరం భక్తులు శ్రీశైలం డ్యాం వద్దకు చేరుకుని డ్యాం అందాలను తనివితీరా ఆస్వాదించారు.

మహానందికి పోటెత్తిన భక్తులు


మహానందీశ్వరుడి దర్శనార్థం క్యూలో వేచిఉన్న భక్తులు

మహానంది: మహానందీశ్వరస్వామి సన్నిధిలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. సెలవు రోజు కావడంతో వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులు స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి కామేశ్వరీదేవి, మహానందీశ్వర స్వామివార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. అనంతరం ఆలయ ప్రాంగణాల్లోని గరుడనంది, వినాయకనంది, రాతినంది, పెద్దనంది ప్రాంతాలను సందర్శించారు.

భక్తిశ్రద్ధలతో రాహుకేతు పూజలు

శ్రావణమాసం, భాను సప్తమి సందర్భంగా మహానందిలో ఆదివారం రాహుకేతు పూజలు నిర్వహించారు. ఈ మేరకు భక్తులు స్థానిక రాహుకేతు మండపంలో స్వామివారికి విశేష పూజలు చేపట్టారు. వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని ఆధ్వర్యంలో వేద పండితులు హనుమంతశర్మ, అర్చకులు రాహుకేతువులకు ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితులు రవిశంకర అవధాని మాట్లాడుతూ శ్రావణమాసం, భాను సప్తమి సందర్భంగా రాహుకేతు పూజలు నిర్వహించడం ద్వారా సకల దోషాలు తొలగిపోతాయని చెప్పారు.

16న సామూహిక వరలక్ష్మీ వ్రతం

మహానంది పుణ్యక్షేత్రంలో ఈ నెల 16న సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించనున్నట్లు వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని తెలిపారు. ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డితో కలిసి ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ. శ్రావణమాసం రెండో శుక్రవారం పురస్కరించుకుని స్థానిక అభిషేక మండపంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించనున్నట్లు చెప్పారు. నంద్యాల పట్టణానికి చెందిన ఏజీఎస్ జ్యువెలర్స్ అధినేత అవ్వారు గౌరీనాథ్, సరస్వతీ దంపతుల సహకారంతో ఏటా వ్రతం నిర్వహిస్తున్నట్లు వివరించారు. పూజల్లో పాల్గొనే మహిళలకు దాతల సహకారంతో పూజా ద్రవ్యాలను అందిస్తామని, వ్రతం అనంతరం మహిళలకు వేదాశీర్వచనంతో పాటు వాయనం, ప్రసాదాలు అందిస్తామన్నారు.


కేసీ కాల్వలో భారీగా నిలిచిన గుర్రపు డెక్క

లస్కర్ల నుంచి డబ్బు వసూలు చేశారంటూ ప్రచారం


ప్రొక్లెయిన్‌తో కాల్వలోని గుర్రపు డెక్కను తొలగిస్తున్న దృశ్యం

జూపాడుబంగ్లా: జూపాడుబంగ్లా లాకుల వద్ద పేరుకుపోయిన గుర్రపు డెక్కను తొలగించేందుకు కేసీ కాల్వ అధికారులు లస్కర్ల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు ఆదివారం సోషల్ మీడియాలో లస్కర్లు పెట్టిన పోస్టు చర్చనీయాంశంగా మారింది. ఎగువ ప్రాంతాల నుంచి కేసీ కాల్వలో భారీఎత్తున గుర్రపు డెక్క నీటి ప్రవాహం వెంట కొట్టుకొని వచ్చింది. అది కాస్త జూపాడుబంగ్లా లాకుల వద్ద నిలిచిపోయి నీటి ప్రవాహానికి ఆటంకంగా మారింది. దీన్ని తొలగించి నీటి ప్రవాహానికి అటంకం లేకుండా చేయాల్సిన బాధ్యత లష్కర్లదే. కాల్వలో భారీగా నిలిచిన గుర్రపు డెక్కను తొలగించడం మనుషులతో సాధ్యం కాక ప్రొక్లెయినర్ సహాయంతో తొలగించారు. అందుకు అయిన ఖర్చు లస్కర్లతో పాటు వర్క్ ఇన్‌స్పెక్టర్ తలా కొంత పెట్టుకున్నారు. ఈ విషయాన్ని జీర్ణించుకోలేని కొందరు లస్కర్లు.. గుర్రపుడెక్క తొలగింపునకు లస్కర్ల నుంచి డబ్బు వసూలు చేశారు, ప్రభుత్వం అధికారులకు డబ్బులు చెల్లించదా? అని ప్రశ్నిస్తూ సోషల్ మీడియాలో పోస్టు చేయడం చర్చనీయాంశంగా మారింది.

ఈ విషయమై కేసీ కాల్వ పర్యవేక్షణ ఏఈ శ్రీనివాసనాయక్ ను వివరణ కోరగా.. కాల్వ గట్టు వెంట ఉన్న కంపచెట్లు, చెత్తాచెదారం, పిచ్చి మొక్కల తొలగింపుతో పాటు కాల్వలో నీటి ప్రవాహానికి అడ్డంగా నిలిచే వాటిని తొలగించాల్సిన బాధ్యత లస్కర్లదేనన్నారు. నీటి ప్రవాహానికి అడ్డంగా భారీగా నిలిచిన గుర్రపు డెక్కను మనుషులతో తొలగించడం సాధ్యం కాక ప్రొక్లెయినర్‌తో తీయించారు. అందుకు తలా కొంత డబ్బులు వేసుకొని ఉంటారు. లస్కర్ల నుంచి తాము డబ్బులు వసూలు చేయలేదన్నారు.